## లావాదేవీలు అడిగితే దాటవేత ధోరణి

- రామగుండంలో అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు
- 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుమలత ఆరోపణ

కోల్‌సిటీ, మే 3: రామగుండం నగర పాలక సంస్థలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని, అధికారులైతే కండువాలు లేని కాంగ్రెస్ కార్యకర్తలుగా పని చేస్తున్నారని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు శనివారం ప్రకటనలో ఆరోపించారు. లావాదేవీలకు సంబంధించి సమగ్ర వివరాలు అడిగితే దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. గడిచిన ఏడాది కాలంగా నగర పాలక సంస్థ లావాదేవీల సమగ్ర వివరాలు కావాలని సమాచార హక్కు (స.హ)చట్టం ద్వారా దరఖాస్తు చేశామని తెలిపారు. నెల రోజులుగా సమాచారం ఇవ్వకపోగా చివరకు జిరాక్స్‌లకు రూ. 5వేలు చెల్లించాలంటూ మున్సిపల్ నుంచి తనకే నోటీసు పంపించారని తెలిపారు. అంతేగాక కార్పొరేషన్‌లోని అన్ని శాఖల లో అవినీతి భారీగా జరుగుతుందని ఆరోపించారు. పలుమార్లు విజిలెన్స్ విచారణ జరిగినా అధికారుల్లో చలనం రావడం లేదని పేర్కొన్నారు. బిల్లులు చెల్లించే విషయంలో పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయని తెలిపారు. కమిషనర్‌తో పాటు ప్రతి అధికారికి ముడుపులు ముడుతున్నాయనీ, ఈ కార్పొరేషన్‌పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెద్దపల్లి/ఎలిగేడు, మే3: ఎలిగేడు మండలంలో ఈనెల 5 నుంచి19వ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష వెల్లడించారు. ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఎలిగేడు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రత్యేక అధికారిగా ఉంటూ పర్యవేక్షిస్తారని తెలిపారు. మూడు బృందాలను ఏర్పాటు చేసి ప్రతి పంచాయతీలో రెండు రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించామని వెల్లడించారు. భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎలిగేడు తహసీల్దార్ ఎండీ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో టీం -1 ఎలిగేడులో 5,6న, లాలపల్లిలో 7,8న , నారాయణపల్లిలో 9,12న, శివపల్లి గ్రామంలో 13,14న రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ బీ యక్కన్న ఆధ్వర్యంలో టీం-2 బుర్హాన్ మియాపేటలో 5, 6న, నర్సాపూర్‌లో 7,8న, సుల్తాన్‌పూర్‌లో 9,12న, లోకాపేటలో 13,14న రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టరేట్ నాయబ్ తహసీల్దార్ ధీరజ్ కుమార్ ఆధ్వర్యంలో టీం-3 దూళికట్ట లో 9,12న, ర్యాకల్ దేవ్‌పల్లిలో 13,14 న, రాములపల్లిలో 15,16 న, ముప్పిరి తోటలో 17,19న సదస్సులు ఉంటాయని వెల్లడించారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు,ఎలిగేడు తహసీల్దార్ బషీరోద్దీన్ పాల్గొన్నారు.

# కోత లేకుండా ధాన్యం కొనాలి

పెద్దపల్లి మే 3: ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి కొనాలని, రైస్ మిల్లుల వద్ద గానీ, ఎక్కడా కూడా కోత విధించటానికి వీల్లేదని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు, తరలింపుపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతి రోజు 15 వేల క్వింటాళ్ల ధాన్యం కూడా లిఫ్ట్ చేయడం లేదని, అకాల వర్షాలు కురిస్తే అనవసరంగా నష్టం వస్తుందని, ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, రైలు మిల్లులలో హమాలీ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీవో శ్రీ మాల, డీఏవో దోమ ఆదిరెడ్డి, డీఆర్‌డీవో ఎం కాళిందిని, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి రూరల్ : కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్

### నాణ్యమైన ధాన్యం కొనుగోలు కొనాలి

పెద్దపల్లి రూరల్, మే 3: జిల్లాలో సింగిల్ విండోలు, ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉన్న నాణ్యమైన రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

కోయశ్రీహర్ష అన్నారు. అప్పన్నపేట సింగిల్ విండో పరిధిలోని అప్పన్నపేట, అందుగులపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇక్కడ పాలకుర్తి తహసీల్దార్ జ్యోతి, అప్పన్నపేట విండో సీఈవో గడ్డి తిరుపతి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పని తీరు మరింత మెరుగు పడాలి

పెద్దపల్లి, మే3: మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికుల పని తీరు మరింత మెరుగు పడాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు బట్టలు (దుస్తులు), ఈఎస్ఐ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం పాటు పడుతున్న పారిశుధ్య కార్మికుల పని తీరు అభినందనీయమని, కానీ పురపాలిక పరిధిలో అక్కడక్కడ అపరిశుభ్రత నెలకొందని పేర్కొన్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం ఉంటుందని, డ్రైనేజీలు క్లిన్ చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

ఏర్పడి కాలనీలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నల్లా ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమై తాగునీరందించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ సతీష్, నాయకులు నూగిళ్ల మల్లయ్య, మస్రత్, శ్రీకాంత్, శ్రీమాన్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం**

సుల్తానాబాద్, మే 3 : జిల్లా క్రీడా శాఖ ఆద్వర్యంలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్, ఖోఖో క్రీడా శిక్షణ శిబిరాలను ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఏయంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, నాయకులు గాజుల రాజమల్లు, సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్యగౌడ్, అమిరిశెట్టి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, అమిరిశెట్టి రాజలింగం, అంతర్జాయతీ ఖోఖో క్రీడాకారుడు, కోచ్ గెల్లు మధుకర్‌యాదవ్, వాలీబాల్ కోచ్ ప్రవీన్ తదితరులున్నారు.

### లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఫర్టిలైజర్‌సిటీ, మే 3: రాజీ మార్గమే రాజీ మార్గంగా జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో విజయవంతం చేయాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శనివారం అదనపు జిల్లా న్యాయస్థాన ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశానికి జడ్జి పాల్గొని మాట్లాడారు. గృహ హింస, వరకట్నం వేధింపులు, ఇతర నేరాలలో రాజీ కుదర్చుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారిగా కేసులను గుర్తించాలన్నారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జీ జీవన్ సూరజ్‌సింగ్, జూనియర్ సివిల్ జడ్జీలు వెంకట సచిన్‌రెడ్డి, వెంకటేశ్ దుర్వ, స్వారిక, ఏజీపీలు శంతన్‌కుమార్, కిషన్‌రావు, సౌజన్య, ఏపీపీ నహీద ఫర్హీన్, సబ్ డివిజన్ ఏసీపీ రమేశ్, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు ఉన్నారు.

### ధాన్యం తూకం వేగవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, మే3: కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేయించి, మిల్లులకు తరలించాలని సివిల్ సప్లై అధికారులు డీటీసీఎస్ జి రవీందర్‌రెడ్డి, మహేశ్ నిర్వాహకులను ఆదేశించారు. కాల్వశ్రీరాంపూర్,మొట్లపల్లి, గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. రశీదులను పరిశీలించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ధాన్యాన్ని త్వరతగతిన తూకాలు వేయించి, మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

### శాన్వి రెస్టారెంట్‌కు రూ. 10వేల జరిమాన

జ్యోతినగర్, మే 3: ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని శాన్వి ఫ్యామిలీ రెస్టారెంట్ నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన రామగుండం నగరపాలక సంస్థ అధికారులు రూ.10వేల జరిమానా విధించారు. ఈ మేరకు శనివారం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు శాన్వి రెస్టారెంట్‌లో తనిఖీలో నాణ్యతలేని ఆహార పధార్థాలను గుర్తించి యాజమానికి జరిమానా విధించారు. అలాగే నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న చంద్రబాబు కాలనీలోని దేవేందర్ కిరాణం షాపుకు రూ.2వేల జరిమానా విధించారు. ఈ తనిఖీలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మధూకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

### సీఐటీయూ సమ్మె నోటీస్

గోదావరిఖని, మే 3: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆర్జీ-1 డివిజన్ కమిటీ శనివారం ఆర్జీ-1 పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబుకు సమ్మె నోటీస్ అందజేశారు. నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దు, బొగ్గు పరిశ్రమల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ నిలిపివేయాలని, కమర్షియల్ మైనింగ్ రద్దుతో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగించాలని, సింగరేణికి కొత్త బ్లాకులు కేటాయించాలని, తదితర డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసును అందజేశారు. ఇక్కడ యూనియన్ ఆర్జీ-1 బ్రాంచీ అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి, ఉపాధ్యాక్షుడు ఆసరి మహేశ్, తోట నరహరిరావు, అన్నబోయిన శంకరన్న, నంది నారాయణ, పెద్దపల్లి శశికుమార్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

**ఆర్జీ -3 జీఎంకు**

రామగిరి, మే 3 : సీఐటీయూ ఆర్జీ-3 కమిటీ ఆధ్వర్యంలో జీఎం సుధాకర్‌రావుకు సార్వత్రిక సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆర్జీ -3 కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ,ఉపాధ్యక్షులు ఈ.కుమార్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, సహాయ క కార్యదర్శి వేణుగోపాల్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీపీసీకి యునైటెడ్ ఫోరం..**

జ్యోతినగర్, మే 3: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొంటున్నట్లు ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌కు సమ్మెనోటీస్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ పరిపాలన భవన్‌లో హెచ్ ఆర్ అధికారికి సమ్మెనోటీసును అందజేశారు. ఇక్కడ వివిధ ట్రేడ్‌ల యూనియన్ల నాయకులు భూమల్ల చందర్, నాంసాని శంకర్, చిలుక శంకర్, ఆర్ లక్ష్మణ్, ఏ శ్రీనివాస్, ఆర్ రాజమల్లయ్య, ఇజ్జగిరి భూమయ్య, సత్యం, జీ వైకుంఠం ఉన్నారు.

**రైల్వేడిపో ఏడీఎంఈకు సమ్మె నోటీస్**

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రామగుండం రైల్వేడిపో ఏడీఎంఈ, అధికారులకు సీఐటీయూ .జిల్లా కోశాధికారి ఎం రామాచారి సమ్మెనోటీసు అందజేశారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, బోనస్ అమలు పరుచాలన్నారు. రైల్వేలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనలని పిలుపునిచ్చారు. ఇక్కడ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బొంకూరి మహేశ్, కే తిరుపతి, ఈ ప్రదీప్, లాలు నాయక్, తదితరులు ఉన్నారు.

## కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలి

గోదావరిఖని, మే 3: బొగ్గు పరిశ్రమల రక్షణ కోసం, సింగరేణి బొగ్గు గనులకు కాపాడుకునేందుకు ఈ నెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఐక్యవేదిక నాయకుల సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, టీఎస్‌యుఎస్ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మకానికి పెట్టిందని, బొగ్గు పరిశ్రమలను సజీవంగా సమాధి చేస్తుందన్నారు. సింగరేణిలో కొత్త బావులకు అనుమతికి కట్టడితో బొగ్గుకు రేటును పెంచకుండా అడ్డుపడుతూ ప్రవేటు ఆధానిల బొగ్గును అధిక ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. అంబానీ, ఆదాని లాంటి వారికి బొగ్గు పరిశ్రమలను అప్పగించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై 10 కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా, పరిశ్రమల రక్షణ కోసం, ఉద్యోగ భద్రత కోసం, అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.26వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమా న వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల భాగస్వామ్యంతో అన్ని సంఘాలను కలుపుకొని సమ్మె విజయవంతం చేసేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఇక్కడ ఐక్యవేదిక నాయకులు జక్కుల నారాయణ, ఈ నరేశ్, సారయ్య, ఎం రాయమల్లు, కుమారస్వామి, ఐ రాజేశం, జీ మల్లేశం, ప్రసాద్‌రెడ్డి, ఎస్ రవీందర్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## కల్వచర్లలో మహిళ దారుణ హత్య

రామగిరి, మే 3: కల్వచర్లలో శుక్రవారం రాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. మహిళను సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి దారుణంగా చంపిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. మద్యం మత్తులో నిందితుడు ఈ హత్యకు ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన మోటం సమ్మక్క (35)ను పత్తి కనకరాజు అనే వ్యక్తి హత్య చేసినట్లు నిర్ధారించారు. సమ్మక్క కల్వచర్లలోని బంధువుల ఇంటికి వచ్చింది. శుక్రవారం రాత్రి కనకరాజు అనే వ్యక్తి మద్యం మత్తులో సమ్మక్కతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో క్షణికావేశంలో కనకరాజు సిమెంట్ ఇటుకతో సమ్మక్క తలపై మోది హత్య చేసినట్లు సంఘటన స్థలం వద్ద లభించిన ఆధారాలను బట్టి భావిస్తున్నారు. ఇద్దరు రోజు పాత ఇనుక సామాన్లు, ప్లాస్టిక్ కొంటూ చిత్తు పేపర్లు ఏరుకుంటూ బేరం నిర్వహిస్తారని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి దవాఖానకు తరలించారు. మృతురాలు సమ్మక్కకు భర్త లేకపోవడంతో కనకరాజుతో కలిసి ఉంటున్నట్లు సమాచారం ఉందనీ, ఆమెకు ముగ్గురు పిల్లలు ఉండగా కనకరాజుకు భార్య, పిల్లలు ఉన్నారని తెలిపారు. హత్యకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ చంద్రకుమార్ తెలిపారు.



నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, మే 3: గోదావరిఖని ప్రశాంత్ నగర్‌లో శుక్రవారం చీమల తిరుపతిపై కత్తులతో దాడిచేసిన అదే కాలనీకి చెందిన రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేశ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ పేర్కొన్నారు. శనివారం గోదావరికని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనరెడ్డితో కలిసి ఏసీపీ అరెస్ట్ వివరాలను వెల్లండించారు. తిరుపతిపై దాడితో అక్కడి నుంచి పారిపోయిన నిందితుల కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటుతో శనివారం ఉదయం గోదావరి నది ఏరియా సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. వెంటనే ఆదుపులోకి తీసుకోని విచారించగా గాయపడిన తిరుపతితో పాటు పట్టుబడిన ఈ కేసు నిందితులు రాజశేఖర్, రాకేశ్ ముగ్గురికి నేరచరిత్ర కలిగి ఉన్నారు. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిళి హత్య కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అట్టీ కేసు ట్రయల్‌కు రావడంతో ప్రధాన నిందితుడు తిరుపతి వద్దకు వెళ్లి కేసు రాజీపడుదామని రాజశేఖర్, రాకేశ్‌లు అడిగితే తిరుపతి ఒప్పుకోలేదు. గత మూడు రోజులుగా మాట్లాడుదామని పిలిచిన తిరుపతి స్పందించలేదు. తమకు శిక్షపడుతుందని, తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని చెప్పిన తిరుపతి స్పదించకపోవడంతో తిరుపతిని హత్య చేస్తే హత్య కేసు నుంచి తప్పించుకోవచ్చని ఆలోచనతో శుక్రవారం తిరుపతి నడుపుతున్న ఎస్ఎం ఆన్‌లైన్ సెంటర్ వద్దకు వచ్చిన రాజశేకర్, రాకేశ్ కత్తులతో దాడికి పాల్పడినట్లు విచారణతో నిందితులు పేర్కొన్నట్లు ఏసీపీ తెలిపారు. దీంతో వెంటనే నిందితులను రమాండ్ తరలించి, వారి వద్ద నుంచి దాడికి ఉపయోగించిన కత్తులు, బైక్ నెంబర్, రక్తపు బట్టలను స్వాధీన పరుచుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

## బాలుడి గొంతులో ఇరుక్కున్న కోడిగుడ్డు

- ఊపిరాడక ఇబ్బందిపడ్డ బాబు
- రక్షించిన 108 సిబ్బంది

పాలకుర్తి,మే3: పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన రాజేశ్ అశ్విని దంపతుల కుమారుడు 8నెలల శ్రేయాన్స్ ఉడకబెట్టిన కోడిగుడ్డు తిని ఊపిరాడక ఇబ్బందిపడ్డాడు. శ్రేయాన్స్ ఆడుకుంటు వంటగదిలోని గంజిలో ఉన్న గుడ్డును మింగడంతో అదికాస్త గొంతులో ఇరుక్కపోయింది. ఊపిరాడని పరిస్థితి ఏర్పడటంతో దిక్కుతోచని బాలుడి కుటుంబ సభ్యులు 108లో హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పెద్దపల్లిలో పరీక్షించిన డాక్టర్లు, కరీంనగర్‌కు రిఫర్‌చేశారు. 108లో కరీంనగర్‌కు తరలిస్తుండగా, బాబు గుడ్డు తేలేయడంతో 108 టెక్నీషియన్, భానుప్రసాద్,. ఈకు బ్యాక్ స్లాబ్స్‌తో పుడ్ పార్టికల్స్ ద్వారా వాంతులు వచ్చులా చేసి బయటి రప్పించాడు. దీంతో బాబు శ్వాస తీసుకున్నాడు. ప్రాణాపాయ స్థితి నుంచి బాలుడిని రక్షించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. 108 సిబ్బంది పలువురు అభినందించారు.

### ఏఐవైఎఫ్ ఆవిర్భా వ వేడుకలు

కోల్‌సిటీ, మే 3: అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏఐవైఎఫ్ జెండాను నీలి అరుణ పతాకంను సీపీఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ ఆవిష్కరించారు. 21 ఏళ్లకు ఓటు హక్కు కల్పించాలని పోరాటం చేసిన ఏకైక సంఘం ఏఐవైఎఫ్ మాత్రమేనని అన్నారు. దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో నాకులు శనిగరపు చంద్రశేఖర్, గౌతం గోవర్ధన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం, వివ, ఆసాల నవీన్, సుధీర్, మాతంగి సాగర్, శనిగరపు తిరుమల, కనకరాజ్, జగన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాతలకు అవగాహన సదస్సులు

పెద్దపల్లి, మే3:వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈనెల 5 నుంచి వచ్చే నెల 11 వరకు రైతు మంగిట వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే పెరిట అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీఏవో దోమ ఆదిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న కాల్వ శ్రీరాంపూర్ మం డలం గంగారం, 12న ముత్తారం మండల కేంద్రం, 24న కాల్వ శ్రీరాంపూర్ మండలం తారుపల్లి, 28న ఓదెల మండలం జీలకుంట, వచ్చేనెల 2న పెద్దపల్లి మండలం రాంపల్లి, 11న పెద్దపల్లిలో అవగాహన సదస్సులు నిర్వహించటం జరుగుతుందని వెల్లడించారు.

**ఫార్మర్ రిజిస్ట్రీ**

వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ జిల్లాలో ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్నట్లు డీఏవో దోమ ఆదిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా 11 నెంబర్ల (యూనిక్ కోడ్) ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుందన్నారు.

**కలెక్టర్‌ను కలిసే వేళ లో మార్పు**

జిల్లా కలెక్టరేట్ వివిధ సమస్యలపై ప్రజలు నేరుగా కలెక్టర్‌ను (తనను) కలిసే సందర్శిన వేళలో స్వల్ప మార్పు చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు కార్యాలయ పని దినాలలో కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. విజిటింగ్ సమయంలో కలెక్టరేట్‌కు రావాలని, మిగిలిన సమయాల్లో వచ్చి, వేచి ఉండి సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు.

### ప్రశాంతంగా ముగిసిన ఎప్‌సెట్ పరీక్షలు

రామగిరి, మే 3: మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల లో ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలు శనివారం ముగిశాయి. ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు గానూ వంద మంది హాజరైనట్లు తెలిపారు. సాయంత్రం వంద మందికి 96 మంది హాజరైనట్లుప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్,మే 3: భూపతిపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ఎం. స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ,ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)ఇంగీష్ కోర్సులలో సీట్లకు అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసిన బాలికలు ఆరో తరగతిలో ప్రవేశాలకు, పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈ నెల 5న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలను సందర్శించి దరఖాస్తులు అందజేయాలన్నారు. సమాచారానికి 996347 1638లో సంప్రదించాలని స్పెషల్ ఆఫీసర్ స్వప్న కోరారు.

**మోడల్ స్కూల్ లో**

ధర్మారం, మే 3: ధర్మారం తెలంగాణ మోడల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ నెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల ని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న వెబ్ సైట్‌లో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఎంపికైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు http:// 183.82.97.97/mstg ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**మల్యాల మోడల స్కూల్‌లో..**

కాల్వశ్రీరాంపూర్, మే3: మల్యాల మోడల్ స్కూల్ , జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పోచయ్య శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ లోని ప్రతి గ్రూప్ లో 40 సీట్లు ఉన్నాయని, ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకొని అడ్మిషన్ పొందాలని వివరించారు. విద్యార్థినిలకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం ఉందని, ఈ అవకాశాన్ని మండల విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

### ప్రమాద రహిత జిల్లాగా రికార్డు సాధించాలి

**ఎన్‌పిడీసిఎల్ ఎస్ఈ కంకటి మాధవరావు**

పెద్దపల్లి రూరల్, మే 3: విద్యుత్ శాఖ ప్రమాదాల విషయంలో ప్రమాద రహిత జిల్లాగా పెద్దపల్లి జిల్లాకు ప్రత్యేక రికార్డును సిధించి పెట్టాలని ఎన్‌పీడీసిఎల్ ఎస్ఈ కంకటి మాధవరావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల విద్యుత్ భవన సముదాయం సమావేశ మందిరంలో విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మే 1 నుంచి 7 వరకు జరిగే విద్యుత్ ప్రమాద భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. విద్యుత్ సరఫరా సందర్భంగా, ఉద్యోగులు గా పని చేస్తున్న సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు, ప్రజలకు, వినియోగదారులకు ఆమోదయోగ్యమైన విదంగా విద్యుత్ శాఖ అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి సర్కిల్, డివిజన్ పరిధిలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### కారుకు తృటిలో తప్పిన ప్రమాదం

ముత్తారం, మే 3: పారుపల్లి గ్రామ శివారులో ఓ కారు శనివారం అదుపు తప్పి పక్కనే ఉన్న పంట భూమిలోకి దూసుకుపోయింది. ఓడేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబంతో పెద్దపల్లి నుంచి ఓడేడు గ్రామానికి కారులో వస్తుండగా పారుపల్లి శివారు వద్ద కారు అదుపు తప్పి పంట భూమిలోకి దూసుకుపోయింది. ఈ క్రమంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు. కాగా తృటిలో ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

### బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి..

పెద్దపల్లి, మే 3: మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి నీటి సమస్య, శానిటేషన్, అభివృద్ధి పనుల వివరాలు తెలుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏఎంసీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ఏఈ సతీశ్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ పాల్గొన్నారు.

### కార్మికులకు అలవెన్స్‌లు చెల్లించాలి

జ్యోతినగర్, మే 3: ఎన్టీపీసీ టౌన్‌షిప్ ఏరియా కన్జర్వెన్సీ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం రూ.1,020 అలవెన్స్, ఏరియర్స్ చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి చిలుక శంకర్, బ్రాంచీ కార్యదర్శి బీ బుచ్చన్న, నాయకులు పీ స్వామి యాజమాన్యంను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

### లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష

అంతర్గాం, మే 3: రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులు సమీక్షించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అభ్యర్థుల ధ్రువీకరణ ప్రక్రియకు సంబంధించి సమీక్ష జరిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

### పనుల పరిశీలన

ముత్తారం, మే 3: రెండు రోజుల క్రితం వీచిన భారీ గాలులకు మండలంలో సుమారు 14 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వాటి స్థానంలో కొత్త స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేయించారు. శనివారం మండలంలోని ఓడేడు గ్రామం వద్ద నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను మంథని డిఇ ప్రభాకర్ పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విరిగిపడ్డ స్తంభాల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఏఈఈ సంతోష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### ఏఐటీయూసీ ఒత్తిడితోనే ఉత్తర్వులు

గోదావరిఖని, మే 3: సింగరేణి యాజమాన్యంపై గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ చేసిన ఒత్తిడి మేరకు మెడికల్ ఇన్వాల్యుడేషన్ అయిన కార్మికుల డిపెండెంట్లకు 35ఎళ్లు దాటిన ప్రభుత్వం ఉద్యోగ ఉత్తర్వాలను జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు నెలల క్రితమే 35 ఏళ్లు దాటిని వారికి ఉద్యోగాలు ఇస్తామని సర్క్యులర్ జారీ చేసినప్పటికి యాజమాన్యం ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దీంతో 40ఏండ్లు దాటిన డిపెండెంట్లు వారి సర్వీస్ కోల్పోతున్నారని యాజమాన్యం దృష్టికి ఏఐటీయూసీ తీసుకువెళ్లడంతో ఆఫీస్ ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.